క్లుప్తంగా

తల్లిపాలు శ్రేయస్కరం



తుమరాడలో ర్యాలీ చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

బలిజిపేట: పిల్లలకు తల్లిపాలు అందించడం వల్ల తల్లులు, పిల్లలకు ఆరోగ్య సమస్యలు లేకుండా ఉంటాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సులేఖ అన్నారు. ఈ మేరకు తల్లిపాల వారోత్స వాల్లో భాగంగా మండలంలోని తుమరాడలో సోమవారం ర్యాలీ నిర్వహించి, తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సులేఖ మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు ఇవ్వడం వల్ల తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ సోకదని, పిల్లలకు మంచి బలం చేకూరుతుందని తెలిపారు. తల్లిపాలు ఏ వయస్సు వరకు పిల్లలకు పెట్టాలో వివరించారు. తల్లిపాలు ఎక్కువగా ఉత్పత్తి అవ్వాలంటే ఎటువంటి ఆహారాన్ని తీసుకోవాలో తెలియజేశారు. తల్లిపాల ప్రాముఖ్యత, కలిగే లాభనష్టాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, ఏఎన్ఎంలు, వైద్యశాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

భారీ వర్షంతో నీటమునిగిన వరినాట్లు



ఇప్పలవలసలో నీటమునిగిన వరినాట్లు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం రాత్రి ఏకధాటిగా కురవడంతో ఇటీవల అరకొర నీటి సౌకర్యంతో దమ్ముచేసి వేసిన వరినాట్లు వేళ్లు తొడిగే సమయంలో నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వివిధ గ్రామాల్లో వరి నాట్లు వేయడానికి సిద్ధమై పల్లపు భూముల్లో అరకొరగా నీటివసతితో ఇప్పలవలస, బూర్జ, తామరఖండి, లక్ష్మీపురం, కాశీపేట తదితర గ్రామాల్లో నాట్లు వేశారు. నాట్లు వేసిన రెండవ రోజు భారీవర్షం కురవడంతో వరి మొనలు తేలిపోయి వేసిన నాట్లు బయటకు వెళ్లిపోవడంతో మళ్లీ వరినాట్లు వేయాల్సిన అవసరం ఉంటుందని ఇప్పటికే అధిక మొత్తంలో పెట్టుబడి రెండవ పర్యాయం పెట్టాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

సంచార చికిత్స ద్వారా తనిఖీలు



అడ్డాపుశీలలో ఓ చిన్నారి జ్వరాన్ని పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురం రూరల్: మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.శ్రీకాంత్ సోమవారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. ఈ మేరకు గర్భిణులతో పాటు వృద్ధులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ రక్తనమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రజలకు సేవలందిస్తున్న 104 మరింత మెరుగైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది తోపాటు 104 సిబ్బంది తదితరులున్నారు.


పశువుల్లో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ శ్రీనివాసరావు

సీతానగరం: పశువుల్లో వస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల పాడిరైతులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ బి. శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్థానిక పశువైద్య కేంద్రంలో సోమవారం జ్వరాలతో వచ్చిన పశువులకు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో పశువులకు కళ్లగుండా నీరు కారడం వంటి జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని తెలియజేశారు. పశువులకు జ్వరం వచ్చిన వెంటనే రైతులు గుర్తించి సమీపంలో ఉన్న రైతు సేవాకేంద్రం, గ్రామీణ పశువైద్య కేంద్రానికి తరలించి తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు. వ్యాధి తీవ్రంగా ఉన్న సమయంలో మండలకేంద్రం, బగ్గందొరవలస నిడగల్లు పశువైద్య కేంద్రాల వైద్యాధికారులను సంప్రదించాలని కోరారు. అలాగే ఏడాది కోడె, ఆడ దూడలకు జన్మనిచ్చే విధంగా ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భోత్పత్తి వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

సీడీపీఓగా మంగమ్మ



సాలూరు రూరల్: సాలూరు పరిధి సీడీపీఓగా కె.మంగమ్మ సోమవారం విధుల్లో చేరారు. ఆమె భోగాపురంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ ప్రమోషన్ పై సాలూరు సీడీపీఓగా నియమితులయ్యారు. విధుల్లో చేరిన తొలిరోజు మండల సర్వసభ్య సమావేశానికి ఆమె హాజరయ్యారు.

వీఆర్ఓది రాజకీయమా? ఉద్యోగమా?

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం
- చాలీచాలని ఎరువుల్లో రాజకీయ ప్రమేయం



వీఆర్ఓ సంతోష్ తీరుపై ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఎంపీటీసీ కళ్లేపల్లి త్రినాథ

సాలూరు రూరల్: మండలంలోని పెదపదం పంచాయతీ వీఆర్ఓ మత్స సంతోష్ ఉద్యోగం చేయకుండా రాజకీయం చేస్తున్నాడని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఎంపీటీసీ కళ్లేపల్లి త్రినాథ తో పాటు పలువురు సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గరుగుబిల్లి రాములమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వైస్ఎంపీపీ రెడ్డి సురేష్ సమావేశాన్ని ప్రారంభించారు. సమావేశంలో తహసీల్దార్ భూముల రీ సర్వే విషయమై ప్రస్తావించే సందర్భంలో పెదపదం వీఆర్ఓ సంతోష్ తీరుపై సభ్యులు ధ్వజమెత్తారు. రేషన్ కార్డు కావాలన్నా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా ముందుగా టీడీపీ నాయకుల ఇంటికి వెళ్లి కలవాలని సూచిస్తున్నాడని ఆరోపించారు. ఒక ప్రజాప్రతినిధినో లేక అధికారులనో కలవాలని చెప్పాలే తప్ప పార్టీ నాయకుల కనుసన్నలో పథకాల అర్హులను గుర్తించడంపై సభ్యులు మండిపడ్డారు. స్థానిక వ్యక్తిని వీఆర్ఓగా నియమించడంపై తమకు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. గ్రామ రెవెన్యూ పరిధిలో దేవుడి మాన్యాలు తెలుగుదేశం నాయకులు స్వాహా చేసే ప్రయత్నంలో భాగంగానే స్థానిక తెలుగుదేశం అనుకూల వ్యక్తిని వీఆర్ఓగా నియమించుకున్నారని ఆరోపించారు.

చివరి వరకు అందని ఎరువులు

సమావేశంలో తొలుత వ్యవసాయ అధికారి శిరీషతో సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎరువులు అందుబాటులో తెస్తున్నామని మండలానికి వచ్చిన ఎరువుల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా శివరాంపురం ఎంపీటీసీ కళ్లేపల్లి త్రినాథ, పారన్నవలస సర్పంచ్ లక్ష్మణ మాట్లాడుతూ ఎరువులు వారానికి ఒక లోడు రావడం లోడు వచ్చిన వెంటనే రైతులు క్యూలో నిలబడడం చివరిగా ఉన్న రైతులకు అందకపోవడం నెలరోజులుగా ఇదే జరుగుతోందన్నారు. ఎరువులు రైతులందరికీ సరిపడే విధంగా సరఫరా చేయడం లేదన్నారు. అలాగే ఎకరా ఉన్న రైతుకు ఒక బస్తా 10 ఎకరాలు ఉన్న రైతుకు ఒక బస్తా ఎరువు ఇస్తే రైతులు ఎలా వ్యవసాయం చేయాలని ప్రశ్నించారు. దీనికి వ్యవసాయ అధికారి సమాధానమిస్తూ చిన్న సన్నకారు రైతులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయన్నారు. అయితే పెద్ద రైతులు మరి వ్యవసాయం చేయనవసరం లేదా అని త్రినాథ ప్రశ్నించారు. అనంతరం విద్యాశాఖ సమీక్షలో భాగంగా ఎంఈఓ మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండి డ్రాపౌట్స్‌గా ఉన్న విద్యార్థులు ఓపెన్ స్కూల్ పరీక్షలు రాసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సారిక కోఆప్షన్ మెంబర్ సూర్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని ఏజెన్సీ పాఠశాల ధూళిభద్రలో ఉపాధ్యాయుడు పనిచేయడం లేదని వారానికి ఒక్కరోజు కూడా పాఠశాలకు వెళ్లడం లేదని ఆరోపించారు. దీనికి ఎంఈఓ మాట్లాడుతూ ఆ ఉపాధ్యాయుడిపై దర్యాప్తు చేసి తగుచర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ఎరువులు అందడం లేదని అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్‌లు, లక్ష్మణ, బంకురు తిరుపతినాయుడు

రాత్రిపూట విధులను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రాత్రిపూట విధులను రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ.రమణ, ట్రెజరర్ జీవీ.రమణలు అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా కనీస ప్రమాద నివారణ చర్యలు చేపట్టకుండా విధులను అప్పగించడం సరికాదన్నారు. జిల్లాలోని పాలకొండ, సాలూరు పట్టణాల్లో రాత్రి పూట విధులను చేపట్టడం లేదని, కేవలం పార్వతీపురంలో మాత్రమే రాత్రి పూట విధులను అప్పగిస్తున్నారన్నారు. అధికారులు పునరాలోచన చేసి రాత్రిపూట విధులను రద్దుచేసి పగటిపూట మాత్రమే విధులను నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.సూరిబాబు, బి.బాల, భానుప్రసాద్, మహేంద్ర, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన అభ్యర్థులనే భర్తీ చేయాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురం: ఏకలవ్య పాఠశాల, డిగ్రీ కళాశాలలోని అధ్యాపకులను గిరిజన అభ్యర్థులతోనే భర్తీచేయాలని గిరిజన సంక్షేమ సంఘ నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో మాట్లాడుతూ గిరిజన యువత ఉపాధ్యాయ శిక్షణ పొంది నిరుద్యోగులుగా ఉన్న వారికి ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అవకాశం కల్పించాలన్నారు. పార్వతీపురం మండలం డోకిశీల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వాచ్‌మన్‌ను బదిలీ చేయాలన్నారు. ఒకే చోట ఎక్కువ కాలం పనిచేయడం వల్ల పాఠశాలలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అనంతరం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ్‌కు వినతిపత్రం అందించారు. వారితోపాటు అభ్యుదయ సంఘం నాయకులు ఆరిక చంద్రశేఖర్, సీహెచ్.సీతారాం, ఎం.నారాయణరావు, కె.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల హెల్త్‌స్క్రీనింగ్ పక్కాగా నిర్వహించాలి

- ఆర్‌బీఎస్‌కే పీఓ డాక్టర్ జగన్‌మోహన్
- వెంకటాపురంలో అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



మాట్లాడుతున్న ఆర్‌బీఎస్‌కే పీఓ డాక్టర్ జగన్‌మోహనరావు

సీతానగరం: పిల్లలు, విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్ పక్కాగా నిర్వహించి ఆరోగ్య పరమైన సమస్యలతో పాటు లోపాలు సకాలంలో గుర్తించాలని జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని వెంకటాపురం(కామందొరవలస)గ్రామంలోని అంగన్వాడీ, హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పిల్లల హెల్త్ స్క్రీనింగ్ వివరాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికి ఎంతమంది అంగన్వాడీ పిల్లలు, స్కూల్ విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించారు. ఏ విధమైన ఆరోగ్య సమస్యలు గుర్తించారు. వైద్యాధికారి నిర్ధారణ చేసినవి, ఇంకా ఎంత మందికి స్క్రీనింగ్ చేయాలి? పెండింగ్ వివరాల ఆన్‌లైన్ నమోదు తీరు పరిశీలించారు. ఆరోగ్య వివరాల రికార్డులను తనిఖీ చేశారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్య పర్యవేక్షణచేయాలని సూచిస్తూ, జ్వరాల లక్షణాలతో ఎవరైనా ఉన్నారా? అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వెల్‌నెస్ కేంద్రంలో మందుల లభ్యతపై పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సంధ్యారాణి, జయలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది ప్రియాంక పాల్గొన్నారు.

కొత్తయాప్‌లతో అదనపు భారం



ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

- సెల్‌ఫోన్లు అప్పగించిన అంగన్వాడీ వర్కర్లు

పార్వతీపురం: ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లను ఇబ్బందులకు గురిచేసేలా తీసుకువచ్చిన కొత్త యాప్‌ల వల్ల అదనపు పనిభారం పెరిగిందని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు గౌరి మణి, సాయి రాజేశ్వరిలు అన్నారు. ఈ మేరకు సోమవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల సంజీవని, ఎఫ్‌ఆర్‌సీ ద్వారా లబ్ధిదారులకు సరుకులు ఇవ్వాలని ఆదేశించి నప్పటికీ గతంలో ఇచ్చిన 2జీ సెల్‌లు పనిచేయడం లేదని దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలుమార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ నేడు, రేపు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప 5జీ సెల్‌లను ఇవ్వడం లేదన్నారు.

జూలై 2024 నుంచి వేతనాలు పెంచుతామని ప్రకటించినప్పటికీ ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. రూ.10వేలు వేతనం వస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిలిపివేయడం సరికాదన్నారు. అన్ని అంగన్వాడీ సెంటర్లకు ట్యాబ్‌లు, 5జీ సెల్‌లు ఇవ్వాలని అధికారులకు వినతులు ఇచ్చినప్పటికీ మంజూరు చేయకపోవడంతో అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. ఈ మేరకు పనిచేయని 2జీ సెల్‌లను ఐసీడీఎస్ కార్యాలయంలో అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, వర్కర్లు పాల్గొన్నారు.



సెల్‌ఫోన్లు చూపుతున్న అంగన్వాడీ వర్కర్లు

ఫేషియల్ యాప్ రద్దు చేయాలి

బలిజిపేట: అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఫేషియల్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ కార్యకర్తలు సీడీపీఓ కార్యాలయంలో వారి సెల్‌ఫోన్లు తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి మాట్లాడుతూ పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు ఆహారం, ఆరోగ్యం విద్య అందించాలని పోషణ ట్రక్కర్ యాప్, బాల సంజీవని యాప్‌లు తీసుకువచ్చి లబ్ధిదారులకు ఆహారం ఓటీపీ ద్వారా ఈకేవైసీ చేసి ఫొటో క్యాప్చర్ చేస్తేనే సరుకులు ఇవ్వాలనే నిబంధనలు పెట్టి లబ్ధిదారులకు నష్టం చేస్తున్నారన్నారు. గతంలో లబ్ధిదారులతో సంతకం పెట్టించుకుని సరుకులు ఇచ్చే పద్ధతి ఉండేదని దానిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్రాలకు బియ్యం, పప్పు, ఆయిల్, గుడ్లు, కిట్లు ఒకేసారి రాకపోవడంతో ఈ పద్ధతి ఏవిధంగా కొనసాగించగలమని ప్రశ్నిస్తున్నారు. అంగన్వాడీలను మానసిక వేదనకు గురిచేసేందుకే ఈ పద్ధతి పెట్టారని దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఆరుగురికి జరిమానా

సీతానగరం: మండలంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ఆరుగురికి బొబ్బిలి మెజిస్ట్రేట్ కోర్టు ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున అపరాధ రుసుము విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించిందని ఎస్సై ఎం. రాజేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఇటీవల సిబ్బంది సహకారంతో వాహనాల తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశామని తెలిపారు.

ఏఓబీ కేటగిరిలో పోస్టులు కేటాయించాలి



ఎస్పీ కార్యాలయం వద్ద సివిల్ కానిస్టేబుల్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు

పార్వతీపురం రూరల్: ఇటీవల వెలువడిన సివిల్ పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఏఓబీ కేటగిరిలో ఎస్టీ అభ్యర్థులకు పోస్టులు కేటాయించి ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ట్రైబల్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో పరీక్షలకు హాజరైన అభ్యర్థులు ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో ఏఓబీ ప్రాంతాలకు చెందిన తాము ఆదివాసీ నిరుద్యోగులమని, సివిల్ కానిస్టేబుల్ పరీక్షల్లో 100 మార్కులు దాటిన వారు తమలో చాలా మంది ఉన్నారని అయితే ఇటీవల వెలువడిన ఫలితాల్లో జిల్లాకు సంబంధించి ఏఓబీ కేటగిరిలో పోస్టులు కేటాయించకపోవడం చాలా అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేసి తన కేటగిరి పోస్టులను ఇప్పించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో టీఆర్ఎఫ్ నాయకులు ఇంటికుప్పల రామకృష్ణా రావు, తోయక గణేష్, ఈశ్వరరావు, మహేశ్వరి, లక్ష్మణ్, వినయ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు తెలియకుండా సర్వే రాళ్లు వేయడం తగదు



నిరసన తెలియజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పాచిపెంట: హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో మండలంలోని సదాబి గ్రామ సమీపంలో గిరిజనులకు తెలియకుండా సర్వే రాళ్లు వేయడం తగదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు, గ్రామ సర్పంచ్ శిల్పజన్ని రామయ్య, గిరిజన సంఘం నాయకులు జన్ని రామయ్య, జన్ని శ్రీరామ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 29, 30 తేదీల్లో గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ ప్రజలకు తెలియకుండా వచ్చి సర్వే రాళ్లను వేశారన్నారు. ఈ ప్రాంత గిరిజనులకు తెలియకుండా గ్రామ సభలు నిర్వహించకుండా సర్వే రాళ్లు వేయడమేమిటని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ సంపదను, ప్రకృతి వనరులను అపారమైన ఖనిజ సంపదను కొల్లగొట్టే విధంగా మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అండగా ఉంటూ ఇటువంటి విధానాలను తీసుకొస్తోందని ఆరోపించారు. సర్వేరాళ్లు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ప్రతి గిరిజన కుటుంబానికి 10 ఎకరాలు చొప్పున పట్టాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని జీవో నంబర్ త్రీ ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజనులు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జె.సుబ్రహ్మణ్యం శిల్పజన్ని అప్పలస్వామి గిరిజన యువత మహిళలు పాల్గొన్నారు.

కూటమి పాలనను ఎండగడుతున్న ప్రజలు



నర్సిపురంలో ఇంటింటికి వంచన కరపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్: ఏ గ్రామానికి వెళ్లినా ఏగడప తట్టినా కూటమి ప్రభుత్వ కుటిల పాలనను ప్రజలు ఎండగడుతున్నారని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మండలంలోని నర్సిపురంలో నిర్వహించిన బాబుష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో స్థానిక మండల నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్థానిక గ్రామస్తులతో ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గడప గడపకు వెళ్లి ఇంటింటికి వంచన కరపత్రాన్ని అందజేస్తూ ప్రజలకు హామీలు ఇచ్చి నేటి వరకు అందించని పథకాలపై ప్రజలతో సంభాషించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, జెడ్పీటీసీ బ బలగ రేవతమ్మ, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీ బి.రవికుమార్, పార్టీ ప్రతినిధులు ముప్వల సత్యంనాయుడు, స్థానిక సర్పంచ్ సీహెచ్ బంగారమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



25వ వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు



పి.రావివలసలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పట్టణంలోని 25వ వార్డులో..

పార్వతీపురం పట్టణంలోని 25వ వార్డులో టౌన్ పోలీస్‌స్టేషన్ వీధిలో బాబుష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైఎస్‌ఆర్‌సీపీ పట్టణ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపలి బాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, మరికొంతమంది పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ష్యూరిటీలతోనే ముంచారు

బలిజిపేట: చంద్రబాబు అమలుకాని ష్యూరిటీలు ఇచ్చి ప్రజలను నట్టేట ముంచారనేది అందరికి తెలిసిన విషయమేనని, ఇకపై చంద్రబాబును నమ్మవద్దని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అన్నారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు బలిజిపేట మండలంలోని పి.రావివలసలో చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని, దీనిని ప్రజలు గుర్తించి భవిష్యత్తులో కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన వాటిని అరకొరగా ఇచ్చి అర్హులను వదిలివేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీఎస్ఆర్ నాయుడు, సర్పంచ్‌లు సుందరరావు, పాపారావు, ఎంపీటీసీ రాజమోహన్, జి.పకీరునాయుడు, ఎం.శ్రీనివాసరావు, టి.సత్యంనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పేరుతో వంచన



కూటమి పాలనపై మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు

సీతానగరం: రాష్ట్రంలో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయకత్వంలో ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను వంచించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ అన్నారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు సోమవారం లచ్చయ్యపేటలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఎంపీటీసీ ఎ.సింహాచలం, పాస్టర్ రాము, ఎలయ్య, వినోద్, బొబ్బిలినాయుడు అప్పలనాయుడుల ఆధ్వర్యంలో క్యూఆర్ కోడ్‌తో ఉన్న పత్రాలతో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గాదెలవలస, జానమల్లువలస, అంటిపేట సర్పంచ్‌లు బి.తిరుపతిరావు, వై. వెంకటనాయుడు, బి.తిరుపతిరావు, జిల్లా, మండల నాయకులు బి శంకరరావు ఆర్వీ పార్థసారథి, వంగపండు వేణు, జె.శ్రీకాంత్, వై శివున్నాయుడు, పారినాయుడు, గొంగాడ లక్ష్మణరావు, వి. అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న పార్వతీపురం



మేదరవీధి జంక్షన్‌లో రహదారిపై నిల్వవున్న వర్షపు నీరు

పార్వతీపురం: చిన్నపాటి వర్షానికే పార్వతీపురం పట్టణం చెరువులను తలపిస్తోంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పట్టణంలోని మేదర్ వీధి జంక్షన్, దేవాంగుల వీధి, కళామందిర్ పరిధిలో, మున్సిపల్ కాంప్లెక్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాలలో వర్షపునీరు చేరడంతో చెరువులుగా మారాయి. ఎన్నో ఏళ్లుగా కాలువల సమస్య ఉన్నప్పటికీ అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టకపోవడంతో చిన్న చిన్న వర్షాలకు కూడా రహదారులు జలమయంగా మారుతున్నాయి. వర్షపు నీరు కాలువల ద్వారా ప్రవహించకపోవడంతో రహదారిపైనే నిల్వ ఉంటోంది. వర్షపునీరు రహదారిపై నిల్వ ఉండడంతో ఆ ప్రాంతంలో వ్యాపారాలు నిర్వహించేవారు అవస్థలు పడుతున్నారు. అలాగే వాహనచోదకులు, పాదచారులకు సైతం రాకపోకలు చేసేందుకు ఇబ్బందులు తప్పడంలేదు. కాలువల్లో పూడికలను తొలగించకపోవడం, కాలువలు ఆక్రమణకు గురికావడంతోనే ఇలా వర్షానికి రహదారిపై నీరు చేరుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.